
సాక్షి ఒడిశా

ఆదివారం । 12 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,70,023లు, బంగారం 2 గ్రాములు, వెండి 1 గ్రాము 100మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



అత్యాచార ఘటనపై విపక్షాల మండిపాటు

బాలికపై ఉపాధ్యాయుల అత్యాచార ఘటనపై విపక్షాలు మండిపడ్డాయి. - 2లో



మహిళా మిషన్ శక్తి బలోపేతానికి కృషి

రాష్ట్రంలో మహిళా మిషన్ శక్తి, స్వశక్తీకరణ బలోపేతానికి కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వెల్లడించారు. - 2లో

సందడే.. సందడి

ఆదివారం దీపావళి పర్వదినం పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల సందడి వాతావరణం నెలకొంది. దీనిలో భాగంగా శనివారం మార్కెట్లు, బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబడ్డారు. అలాగే బాణాసంచా దుకాణాల్లో క్రాకర్స్ కొనేందుకు అధిక సంఖ్యలో ప్రజలు ఆసక్తి కనబర్చారు.

– సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: మార్కెట్‌లో అమ్మకానికి పెట్టిన వివిధ రకాల ప్రమిదలు



రాయగడ: బాణాసంచా దుకాణం వద్ద రద్దీ



బరంపురం: పెద్ద బజార్‌లో పూజా సామగ్రి అమ్ముతున్న మహిళ



బరంపురం: పెద్ద బజారులో కిటకిటలాడుతున్న బంగారం దుకాణం



బరంపురం: అన్నపూర్ణ రోడ్‌లో పువ్వులు విక్రయిస్తున్న వ్యాపారులు



పర్లాకిమిడి: ఆకాశ దీపాలు వదులుతున్న యువకులు



పర్లాకిమిడి: జైశ్రీరామ్ పేరుతో దీపాలు వెలిగించిన దృశ్యం



పర్లాకిమిడి: సరస్వతీ శిశు విద్యా మందిర్‌లో దీపావళి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

‘ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహినీపతి

జయపురం: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి అన్నారు. నియోజకవర్గం పరిధిలోని బొరిగుమ్మలో సరస్వతీ శిశు మందిర్, ప్రజ్ఞాభారతి నూతన భవనాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే దేశానికి సంపద కాగలరని పేర్కొన్నారు. నూతన భవనాల నిర్మాణం కోసం ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసిన ఆయన, నిరుపేద విద్యార్థుల కోసం మరో రూ.లక్ష బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా బొరిగుమ్మ బ్లాక్ విద్యాధికారి సచిన్ మల్లిక్, విద్యా వికాస సమితి కో–ఆర్డినేటర్ సుకాంత కుమార్ బెహర, జయపురం సరస్వతీ శిశు మందిర్ పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీకాంత మిశ్ర, పాఠశాల పరిచాలన కమిటీ అధ్యక్షుడు ప్రఫుల్ల దండసేన, కార్యదర్శి సూర్యనారాయణ పండ, కోశాధికారి కాళీ పాత్రో, బృందావన పండ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఏనుగు మృతి



మృతి చెందిన ఏనుగు

బరంపురం: గంజాం జిల్లా దిగపండి అటవీ రేంజ్ చీకిటి బ్లాక్ పరిధిలో గోవిందపూర్ పంచాయతీ పనడా గ్రామంలో శనివారం విద్యుత్ షాక్‌తో ఏనుగు మృతి చెందింది. సమాచారం అందుకున్న గుముసరా డివిజన్ అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ఏనుగు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అటవీ అధికారులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గత నాలుగు రోజుల నుంచి గుముసరా అటవీ ప్రాంతం నుంచి 13 ఏనుగుల గుంపు చికిటి బ్లాక్ పరిధి గ్రామాలకు శివారులోని వరి కుప్పలు తినేందుకు వస్తున్నాయి. అయితే ఈ సమయంలో విద్యుత్ షాక్ తగిలి మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. పశు వైద్యుల సాయంతో పోస్టుమార్టం నిర్వహించి అక్కడే ఖననం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రమాద స్థలంలో బోల్తాపడిన ఆటో, బైక్



రామ మజ్జి మృతదేహం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి గుడుబలి పంచాయతీ బొర్తిబలి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మృతుడు సమితిలోని కొదొమొచొర గ్రామానికి చెందిన రామమజ్జి(24)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. తన గ్రామం నుంచి రామమజ్జి ఒక ద్విచక్ర వాహనంపై తన స్నేహితుడితో కలిసి కాసీపూర్‌కు పనిమీద వెళ్లాడు. అనంతరం తిరిగి వస్తున్న సమయంలో బొర్తిబలి వద్ద ఎదురుగా వస్తున్న ఆటోని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే రామమజ్జి మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌తో సహా బైకుపై వెనుక కూర్చున్న వ్యక్తి గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనెల 20 నుంచి రాష్ట్రపతి పర్యటన




- మూడు రోజుల పాటు పర్యటన
- బాదంపహాడ్ నుంచి రాయ్‌రంగపూర్ వరకు రైలులో ప్రయాణం

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల రాష్ట్ర పర్యటనకు రానున్నారు. గతేడాది జూలైలో రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ముర్ము తన సొంత జిల్లాకు రావడం ఇది రెండోసారి. రాష్ట్రపతి పశ్చిమ బెంగాల్ కలైకుండ విమానాశ్రయం నుంచి విమానంలో బయల్దేరి ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 1.55 గంటలకు మయూర్‌భంజ్ జిల్లా బరిపదా చేరుతారు. ఆ తర్వాత ఆమె అఖిల భారత సంతాలి రచయితల సంఘం సాహిత్య ఉత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. 21న బాదంపహాడ్ రైల్వేస్టేషన్‌లో పచ్చజెండా ఊపి 3 కొత్త ప్రయాణికుల రైలు సేవలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.20 గంటలకు రాయ్‌రంగపూర్‌కు రైలులో బయల్దేరుతారు.

ఆగ్నేయ రైల్వేకి కేటాయించిన 4 జతల కొత్త ప్రయాణికుల రైళ్లలో మయూర్‌భంజ్ జిల్లాకు 3 జతల రైళ్లు లభించడం విశేషం. వీటిలో కోల్‌కతా (షాలిమార్)–బాదంపహాడ్–కోల్‌కతా (షాలిమార్) వీక్లీ ఎక్స్‌ప్రెస్, బాదంపహాడ్–రూర్కెలా–బాదంపహాడ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్, రూర్కెలా–టాటానగర్–రూర్కెలా (వారానికి 6 రోజులు) మరియు టాటానగర్–బాదంపహాడ్–టాటానగర్ (వారానికి 6 రోజులు) ఉన్నాయి. ఆగ్నేయ రైల్వే పరిధిలో ఈ రైళ్ల రవాణాకు భారతీయ రైల్వే ఇటీవల ఆమోదించింది. ఆమె అదే రోజు సాయంత్రం 4.10 గంటలకు బుర్లా చేరుతారు. బుర్లా వీఎస్ఎస్‌యూటీ వార్షిక స్నాతకోత్సవానికి హాజరవుతారు. ఈనెల 22న రాష్ట్రపతి ఉదయం 11.05 గంటలకు బ్రహ్మకుమారీల రైజ్ కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం ఆమె ఝార్సుగుడ వీర్ సురేంద్ర సాయి విమానాశ్రయం నుంచి విమానంలో ఢిల్లీకి చేరుకుంటారు. భారత రాష్ట్రపతి సొంత జిల్లా మయూర్‌భంజ్ కులియానాలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను రాష్ట్రపతి నవంబర్ 21న ప్రారంభిస్తారని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ టుడు తెలిపారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం



ఐఎండీ జారీ చేసిన వాతావరణ చిత్రం

- ఈనెల 14 నాటికి ఏర్పడే అవకాశం

భువనేశ్వర్: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈనెల 14వ తేదీ నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. రెండు రోజుల్లో పశ్చిమ–వాయువ్య దిశగా కదులుతూ నవంబర్ 16 నాటికి వాయుగుండంగా మారి దక్షిణ బంగాళాఖాతం తీరం ప్రభావితం చేస్తుందని భారత వాతావరణ శాఖ ఐఎండీ అంచనా వేసింది. దీని ప్రభావంతో ఈనెల 15వ తేదీ నుంచి రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీనిలో భాగంగా... నవంబర్ 15వ తేదీన దక్షిణ కోస్తా ఒడిశా, మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, ఉత్తర కోస్తా ఒడిశాలో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన వర్షం కురుస్తుంది. 16న కోస్తా ఒడిశాలో కొన్ని చోట్లు, మయూర్‌భంజ్, కెంజొహర్, అంగుల్, ఢెంకనాల్, బౌధ్, కంధమల్, కలహండి, రాయగడ, కొరాపుట్ మరియు మల్కన్‌గిరిలలో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. 17న ఉత్తర కోస్తా ఒడిశా, కెంజొహర్, మయూర్‌భంజ్, ఢెంకనాల్, అంగుల్, ఖుర్దా, పూరీలోని కొన్నిచోట్ల, దక్షిణ కోస్తా ఒడిశాలోని మిగిలిన జిల్లాలు, కంధమల్, బౌధ్, మల్కన్‌గిరి, రాయగడ, నబరంగ్‌పూర్, కలహండి మరియు సుందర్‌గడ్, కొరాపుట్‌లోని ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. దీంతో ఈ ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేశారు.

వేగవంతమైన గాలులు

నవంబర్ 14–15 తేదీల్లో మధ్య ఆగ్నేయ బంగాళాఖాతం ఆనుకుని ఉన్న అండమాన్ సముద్రం మీదుగా గంటకు 40–45 కి.మీ వేగంతో వీచే గాలులు గంటకు 55 కి.మీ వేగంగా బలం పుంజుకుంటాయి. నవంబర్ 15–16 తేదీలో పశ్చిమ మధ్య బంగాళాఖాతం మరియు ఆనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతం, నైరుతి మరియు ఆగ్నేయ బంగాళాఖాతం మీదుగా గంటకు 40–45 కి.మీ వేగంతో గాలులు వీస్తాయి. రానున్న 5 రోజుల్లో రాత్రి ఉష్ణోగ్రతలో భారీ మార్పు ఉంటుందని వాతావరణ శాఖ సమాచారం.

10 వేల మందితో గీతా పఠనం



గీతా పఠనం నిర్వహిస్తున్న దృశ్యం

బరంపురం: స్థానిక ఖల్లికోట్ విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో 10 వేల మందితో గీతా పఠనం కార్యక్రమం శనివారం ఉదయం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల, పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ప్రజలు, ఎన్జీవో సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

బాణాసంచా సీజ్

- ఇద్దరు అరెస్టు



సీజ్ చేసిన బాణాసంచాతో పోలీసులు

బరంపురం: గంజాం జిల్లా అస్కా పోలీసుస్టేషన్ పరిధి నోలగొంటా గ్రామంలో లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్న బాణాసంచాపై పోలీసులు శనివారం దాడిచేసి రూ.5 లక్షలు విలువైన బాణాసంచా సీజ్ చేయడంతో పాటు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఐఐసీ ప్రశాంత్ కుమార్ సాహూ మాట్లాడుతూ.. అక్రమంగా బాణాసంచా విక్రయించడం నేరమని స్పష్టం చేశారు. ఎవరైనా నింబధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రారంభమైన గోల్డ్‌కప్ ఫుట్‌బాల్ పోటీలు

- మొదటిసారి పాల్గొన్న ఒక విదేశీ టీమ్
- తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన నైజీరియా జట్టు



మొదటి రోజు విజయం సాధించిన జట్లు

జయపురం: కొరాపుట్ జిల్లా బొయిపరిగుడలోని పాత బొరిగుమ్మ స్టేడియంలో బొరిగుమ్మ మాబుడి ఠకురాణి క్రీడా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ గోల్డ్‌కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు శనివారం నుంచి ప్రారంభమైంది. ఎప్పుడూ దేశంలోని వివిధ ప్రాంతాల జట్లు మాత్రమే పాల్గొనే ఈ టోర్నమెంట్‌లో తొలిసారి ఒక విదేశీ టీమ్ నైజీరియా జట్టు పాల్గొనడంతో ఆసక్తి నెలకొంది. పోటీల్లో భాగంగా తొలిరోజు రెండు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో భోపాల్ ధనబాద్ జట్టుపై నైజీరియా జట్టు విజయకేతనం ఎగురవేసింది. అనంతరం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కత భువనేశ్వర్ టీమ్‌లు తలపడ్డాయి. ఇందులో భువనేశ్వర్ టీమ్ కోల్‌కత టీమ్‌ను ఓడించి విజేతగా నిలిచింది.

సంతోషంగా ఉంది: హీరో సవ్యసాచి

అంతర్జాతీయ గోల్డ్‌కప్ ఫుట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా ఓలివుడ్ హీరో సవ్యసాచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బొరిగుమ్మలో అంతర్జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. తనకు అపూర్వంగా అభిమానులు, ప్రజలు స్వాగతం పలికినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన సినీ డైలాగులతో ప్రజలను అలరించారు.

క్రీడా పోటీల నిర్వాహక మాబుడి ఠకురాణి క్రీడా సంఘం అధ్యక్షుడు పద్మన కుమార్ స్వైయ్ మాట్లాడుతూ.. న్యాయవాది లాలూ షొడంగి సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పోటీల్లో 16 టీమ్‌లు పాల్గొంటున్నాయని వెల్లడించారు. గత 13 ఏళ్ల నుంచి నిర్వహించబడుతున్న ఈ టోర్నమెంట్‌ను ఈ యేడాది అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో క్రీడా సంఘం కో–ఆర్డినేటర్ అప్పు ఖాన్, ఉపాధ్యక్షుడు బబులా నాగ్, కోశాధికారి కైలాస కొచ్చిమ తదితరులు పాల్గొన్నారు.



హీరో సవ్యసాచికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

క్లుప్తంగా

లారీ బోల్తాపడి ఇద్దరికి గాయాలు



లారీ బోల్తాపడిన దృశ్యం

రాయగడ: జిల్లాలోని అంబోదల పోలీసుస్టేషన్ పరిధి పెడిగుడ వద్ద శనివారం లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, హెల్పర్ తీవ్రగాయాలకు గురయ్యారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను మునిగుడ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అంబొదల ఐఐసీ కార్తీక్ నాయక్ తెలియజేసిన వివరాల ప్రకారం.. బొగ్గు లోడుతో లారీ కలహండి జిల్లా భవానీపట్నం వైపు వెళ్తుతున్న సమయంలో, పెడిగుడ వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో లారీ డ్రైవర్ సదన్ యాదవ్ (32), హెల్పర్ సునీల్ యాదవ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. అటువైపుగా వెళ్తున్న కొందరు ఈ సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు. క్షతగాత్రులు ఛత్తీస్‌ఘడ్ జిల్లాలోని రాయిపూర్‌కు చెందినవారిగా గుర్తించారు.

దోషిగా బాల నేరస్తుడు

భువనేశ్వర్: 2 ఏళ్ల కిందటి నార్కోటిక్ డ్రగ్స్ స్వాధీనం కేసులో తొలిసారిగా రాష్ట్రంలో న్యాయస్థానం బాలుడిని దోషిగా నిర్ధారించింది. కోర్ట్ ఆఫ్ జువెనైల్ జస్టిస్ బోర్డు ఖుర్దా సెక్షన్ 21(సి) ఎన్‌డీపీఎస్ చట్టం 1985 ప్రకారం బాల నేరస్తుడిని దోషిగా పేర్కొంది. ఈ నేపథ్యంలో 3 సంవత్సరాల కోసం స్పెషల్ హోమ్ బెర్హంపూర్‌కు పంపింది. ఈ వ్యవధిలో విద్యతో సంస్కరణాత్మక చర్యలు చేపట్టాలని అనుబంధ వర్గాలకు ఆదేశించింది. ఈ కార్యాచరణలో భాగంగా నైపుణ్యాభివృద్ధి, కౌన్సెలింగ్, ప్రవర్తన మార్పు, మానసిక చికిత్స కల్పించాల్సి ఉంటుందని న్యాయస్థానం స్పష్టం చేసింది.

ఇదీ విషయం

2021 సంవత్సరంలో 1.268 కిలోల బరువున్న బ్రౌన్ షుగర్‌ను స్వాధీనం చేసుకున్న కేసులో బాల నిందితుడికి వ్యతిరేకంగా కేసు నమోదయ్యింది. ఆ సంవత్సరం ఆగస్టు 12న భువనేశ్వర్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) ఖుర్దా బస్టాండ్ సమీపంలో 1.268 కిలోల బ్రౌన్ షుగర్ మరియు ఇతర నేర సంబంధిత సరంజామాతో బాలుడితో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుంది. స్వలాభం కోసం బ్రౌన్ షుగర్ అక్రమ లావాదేవీలు జరుపుతున్నట్లు నివేదికలో పేర్కొంది. విచారణ సమయంలో న్యాయస్థానం 11 మంది సాక్షులను ప్రశ్నించి, 44 విశ్వసనీయ పత్రాలను పరిశీలించిన మేరకు తుది తీర్పు వెల్లడించింది.

ఎన్నికల బూత్‌ల సందర్శన



పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, ఎన్నికల అధికారి స్మృతి రంజన్ ప్రధాన్ పర్లాకిమిడిలోని ఖంజావీధి మున్సిపల్ పాఠశాలలో బూత్‌లను శనివారం పరిశీలించారు. ఓటర్ల ఫొటో జాబితా సవరణ పర్యవేక్షణలో కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్ ఉన్నారు.

ముగిసిన చండీహోమం

శ్రీకాకుళం కల్చరల్: విజయదుర్గా అమ్మవారి ఆలయ అర్చకుడు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ నేతృత్వంలో చండీహోమం శనివారం పూర్ణాహుతితో ముగిసింది. మూడు రోజులుగా జరుగుతున్న చండీ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మహిళ మృతదేహం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని ఇందిరా విజ్ఞాన్‌భవన్ షాపింగ్ కాంప్లెక్స్ వరండాలో శనివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈమె కొన్నాళ్లుగా పరిసర ప్రాంతంలో భిక్షాటన చేస్తూ ఉండేదని చెప్పారు. మృతదేహాన్ని వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రిమ్స్ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. వివరాలు తెలిసిన వారు 6309990845 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

అత్యాచార ఘటనపై విపక్షాల మండిపాటు

- బాధిత కుటుంబానికి పరిహారం అందజేయాలి
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

కొరాపుట్: బాలికపై ఉపాధ్యాయుల అత్యాచార ఘటనపై విపక్షాలు మండిపడ్డాయి. ఈ మేరకు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్, బీజేపీలు వేర్వేరుగా మీడియా సమావేశాలు శనివారం ఏర్పాటు చేశాయి. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ నియోజకవర్గం రాయిఘర్ సమితి కుందయి పోలీసుస్టేషన్ పరిధి హతబరండి ఆశ్రమ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న బాలిక (11)పై, ఆ పాఠశాలకి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు అత్యాచారం చేశారు. ఇది తెలిసిన వెంటనే జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి హుటాహుటిన నబరంగ్‌పూర్ చేరుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠితో కలిసి బాలిక చికిత్స పొందుతున్న జిల్లా కేంద్ర ఆస్పత్రికి వెళ్లి, బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఎస్పీ రోహిత్ వర్మతో సమావేశమయ్యారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్పీ స్పందిస్తూ ఇప్పటికే నిందితులను



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిత్యానంద గోండో

అరెస్ట్ చేసి జైలుకి తరలించామన్నారు. అనంతర జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రతో సమావేశమయ్యారు. ఉపాధ్యాయులను డిస్మిస్ చేయాలని, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిని బదిలీ చేయాలని, బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ డిమాండ్లు ప్రభుత్వానికి తెలియజేస్తానన్నారు.

ఒడిశాలో ఎక్కువగా అత్యాచారాలు

అనంతరం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బాహిణీపతి మీడియాతో మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ తర్వాత ఒడిశాలో మాత్రమే ఎక్కువ అత్యాచారాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. తన డిమాండ్లు నెరవేరకపోతే 15 రోజులు తర్వాత జిల్లా బంద్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఉమ్మర్ కోట్ ఎమ్మెల్యే నిత్యానంద గోండో నేతృత్వంలో బీజేపీ నాయకుల బృందం బాలిక కుటుంబాన్ని పరామర్శించింది. అనంతరం జిల్లా బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నిత్యా మట్లాడుతూ బాలిక కుటుంబానికి రూ.30 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదే సమావేశంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బలభద్ర మజ్జి మాట్లాడుతూ ఈ ఘటనకి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యాచారాలు పెరిగిపోతుంటే హోంశాఖ నిద్రపోతుందా అని ప్రశ్నించారు.



కలెక్టర్ కమలోచన్ మిశ్రతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

గో గ్రీన్ దివాలి

- హరిత బాణాసంచాతో పర్యావరణానికి భద్రత

భువనేశ్వర్: 2018 సంవత్సరంలో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ – నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఐఆర్ – ఎన్ఈఈఆర్ఐ) పచ్చదనంతో కూడిన పండుగల సీజన్ ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ఇది గ్రీన్ క్రాకర్ (హరిత బాణాసంచా)లను చిన్న షెల్‌తో కూడిన పటాకులుగా నిర్వచించింది. బూడిద మరియు ఉద్గారాలను తగ్గించడానికి ధూళిని అణిచివేసే పదార్థాలు, ప్రత్యేకించి నలుసు పదార్థాల వంటి సంకలనాలు ఈ వర్గం బాణాసంచాలో ఉండవని తెలిపింది. హరిత బాణాసంచా మెగ్నీషియం మరియు బేరియంకు బదులుగా పొటాషియం నైట్రేట్ మరియు అల్యూమినియం, ఆర్సెనిక్ మరియు ఇతర హానికరమైన కాలుష్య కారకాలకు బదులుగా కార్బన్ వంటి ప్రత్యామ్నాయ రసాయనాలతో తయారవుతాయి. సాధారణ బాణాసంచా 160 నుంచి 200 డెసిబెల్స్ శబ్ద తీవ్రత కలిగి ఉంటాయి. హరిత బాణాసంచా శబ్ద తీవ్రత 100 నుంచి 130 డెసిబుల్స్‌కు పరిమితం. వీటిని కాల్చడం వల్ల నీటి ఆవిరి ఉత్పత్తి అవుతుంది. దీంతో వెలువడే బూడిద ధూళిని తగ్గిస్తుంది. సాంప్రదాయ బాణాసంచాతో పోలిస్తే హరిత బాణాసంచా 30 శాతం తక్కువ రేణువులతో పర్యావరణ (పరిసరాల) కాలుష్యాన్ని కలిగిస్తాయి.



హరిత బాణాసంచా గుర్తించడం ఇలా..

సీఎస్ఐఆర్ – ఎన్ఈఈఆర్ఐ మరియు పీఈఎస్‌వో యొక్క విలక్షణమైన ఆకుపచ్చ రంగు లోగో, క్విక్ రెస్పాన్స్ (క్యూఆర్) కోడ్ ద్వారా హరిత బాణాసంచా గుర్తించవచ్చు. మూడు వర్గాల హరిత బాణాసంచా అందుబాటులో ఉంది. వాటిని పరిశీలిస్తే...

స్వాస్ (సేఫ్ వాటర్ రిలీజర్): ఇది ధూళిని తగ్గించడానికి వాతావరణంలోకి నీటి ఆవిరిని విడుదల చేస్తుంది. ఇది 30 శాతం తక్కువ రేణువులను విడుదల చేస్తుంది. సల్ఫర్ లేదా పొటాషియం నైట్రేట్ కలిగి ఉండదు.

స్టార్ (సేఫ్ థెర్మైట్ క్రాకర్): పొటాషియం నైట్రేట్ లేదా సల్ఫర్‌ను కలిగి ఉండదు. తక్కువ రేణువులను విడుదల చేస్తుంది మరియు ధ్వని తీవ్రతను తగ్గిస్తుంది.

సఫల్: ఇది అల్యూమినియం మరియు మెగ్నీషియం కనిష్ట వినియోగాన్ని కలిగి ఉంటుంది. సాంప్రదాయ పటాకుల కంటే ఇది తక్కువ శబ్దాన్ని ఉత్పత్తి చేస్తుంది. వీధి వ్యాపారుల కంటే గుర్తింపు పొందిన దుకాణాల్లో విశ్వసనీయమైన హరిత బాణాసంచా లభిస్తుంది.

నేటి నుంచి గజలక్ష్మి పూజలు



ఏర్పాటైన పూజా మందిరం

రాయగడ: స్థానిక సమితి కార్యాలయం సమీపంలోని కాళీ మందిరంలో ఆదివారం నుంచి గజలక్ష్మి పూజలు ప్రారంభం కానున్నాయి. దీనిలో భాగంగా మొదటి రోజు అంకురార్పణ, సూర్యపూజ, అవాహనం, ప్రాణ ప్రతిష్ట, షోడోపచార, నిషా పూజలు జరుగుతాయి. అదేవిధంగా 12 రోజుల పాటుగా జరిగే ఈ పూజల్లో భాగంగా కాళీమాతను గురుతార, త్రిపుర సుందరి, భువనేశ్వరి, త్రిపుర భైరవి, చిన్నమస్తా, ధూమావతి, బగలాముఖి, మాతంగణి, కమాలాత్మిక, బాల్యకుమారి తదితర రూపాల్లో పూజిస్తారు. ప్రతీ ఏడాది ఈ కాళీపూజ ఉత్సవాలను ఫ్రెండ్స్ యువజన సంఘం అత్యంత ఘనంగా నిర్వహిస్తుందని, ఉత్సవాలను తిలకించేందుకు వేలాది సంఖ్యలో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు హాజరవుతారని సంఘం సాధారణ కార్యదర్శి శివకుమార్ పట్నాయక్ తెలియజేశారు. ప్రతిరోజూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఉత్సవాల్లో భాగంగా భారీ ఎత్తున పూజా మందిరం, షాపింగ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.



విగ్రహాలు రూపుదిద్దుకుంటున్న దృశ్యం

ఆదిత్యుని సన్నిధిలో వైజాగ్ రేంజ్ కమాండెంట్

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని విశాఖపట్నం రేంజ్ హోంగార్డు విభాగ కమాండెంట్ యు.రామ్మోహనరావు కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. పోలీస్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జి.సిగడాం: ఎవరైనా ప్రభుత్వం అనుమతులు లేకుండా బాణ సంచా విక్రయిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సామంతుల రామారావు హెచ్చిరంచారు. మండలంలోని వాండ్రంగి, ఆనందపురం, పాలఖండ్యాం, డి.ఆర్.వలస, సర్వేశ్వరపురం తదితర గ్రామాల్లో శనివారం పర్యటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆక్రమంగా మందుగుండు సామగ్రిని అమ్మితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కడైనా కోడి పందాలు, జూదం శిబిరాలు నిర్వహిస్తే దాడులు చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. బాలికలను అకతాయిలు ఇబ్బందిపెడితే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సచివాలయంలో ఉన్న మహిళా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సోషల్ మీడియాలో అనవసరమైన కథనాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. హెచ్‌సీ పాగిరి శంకరరావు, రామకృష్ణ ఉన్నారు.

సంజీవరాయునికి 50 తులాల వెండి సేకరణ

శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలోని బాయమ్మతోటలో సఖియా మఠం నిర్వహణలో ఉన్న సంజీవరాయ స్వామి దేవాలయంలో స్వామికి రజత కిరీటం, కవచం చేయించేందుకు పలువురు భక్తులు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా 50 తులాల వెండిని వితరణ చేసినట్లు విశ్వజయం గ్రూపు ప్రతినిధి కాశిని వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. వీటిని చేయించడానికి 130 తులాల వెండి అవసరం ఉంటుందన్నారు. శని త్రయోదశి సందర్భంగా స్వామికి అర్చకులు ఈదరపు వెంకట ప్రశాంత్ శర్మ, తుమరాట సందీప్‌లచే పూజలు చేశారు. స్వామికి నూతన వస్త్రాలను చలపాక హేమశ్రీనివాస్ దంపతులు సమర్పించారు. ఆలయ ధర్మకర్త పూర్ణచంద్రదాస్, యు.త్రినాథరావు తదితారులు పాల్గొన్నారు.

బాణసంచా పట్టివేత

శ్రీకాకుళం క్రైమ్: అనుమతి లేకుండా విక్రయిస్తున్న బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్టు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. నగరంలోని రిమ్స్ ఆస్పత్రి రోడ్డు పక్కన బావాజీనగర్ ఒకటో లైన్‌లో ఓ వృద్ధుడు శుక్రవారం రాత్రి 10.15 గంటలకు అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేసి.. అతని వద్ద నుంచి రూ. 9 వేలు విలువైన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై ఎస్సై లక్ష్మణరావు శనివారం కేసు నమోదు చేశారు.

బీసీ రథయాత్రను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): హక్కుల సాధన కోసం డిసెంబర్ ఏడో తేదీన నిర్వహించనున్న బీసీల రథయాత్రను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతి రావు కోరారు. శ్రీకాకుళంలోని ఎన్జీవోహోమ్‌లో శనివారం సంఘం కార్యవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ నాయుకులు మాట్లాడుతూ.. ఈ నెల 15న రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గం సభ్యులతో కలిసి కంపోస్టు కాలనీలోని యాదవ సామాజిక భవనంలో బీసీ రథయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తామన్నారు. శ్రీకాకుళంలో జరగబోయే రథయాత్రకు రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, 139 బీసీ కులాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు బాడాన దేవభూషణరావు, బుడుమూరు రాజేష్, కాయితి వెంకటరమణ, పాలిన ప్రసాద్, గద్దిబోయిన కృష్ణ, ఇప్పిలి చిన్నారావు, మూల నారాయణ, కర్రి రంగాజీదేవ్, కాళ్ల వెంకటరావు, రౌతు శంకరరావు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ



విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికలు గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ అండర్ -14, 17, 19 విభాగాల్లో సత్తా చాటారు. అండర్ -14లో బాల్ బ్యాడ్మింటన్‌లో జె.దీపిక (7వ తరగతి), ఎం.అస్మిత (8వ తరగతి) రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారం, అండర్-19లో పద్మశ్రీ (10వ తరగతి), టి.భవాని (8వ తరగతి) ద్వితీయ స్థానంలో నిలిచి రజిత, అండర్-17లో ఎస్.నందిని (ఇంటర్మీడియట్), కె.ధనషి (9వ తరగతి), తృతీయ స్థానంలోని నిలిచి కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థినులను శనివారం పాఠశాలలో ప్రిన్సిపాల్ బి.లక్ష్మి, పీడీ కె.పద్మావతి, పీఈటీ ఆశాజ్యోతి, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు మండలంలోని డి.బొండపల్లి (డి.ఆర్.వలస) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న శంభాన కార్తీక్ (17) ఎంపికయ్యాడని హెచ్‌ఎం కూర్మినాయుడు శనివారం తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వంహించిన ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడన్నారు. ఈ నెల 15 నుంచి 17 తేదీ వరకు నంద్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని పీడీలు రాజ్యలక్ష్మి, బెనర్జీ తెలిపారు. విద్యార్థిని సర్పంచ్ కుమరాపు శాంతమ్మ, ఎంపీటీసీ సభ్యులుడు రమేష్‌నాయుడు, ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కుమరాపు లక్ష్మణరావు, బి.కృష్ణంనాయుడు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

12 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు పోలీసులు శనివారం మధ్యాహ్నం మోటు కూడలి వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో బ్యాగ్‌తో ఒక వ్యక్తి గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. మహ్మద్ నయీం అనే వ్యక్తి కలిమెల సమితిలో తక్కువ ధరకు 12 కేజీల గంజాయిని కొని, మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు.



రాయగడ: పోలీసులకు గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబొదల పోలీసుస్టేషన్ పరిధి జిగిడి కూడలిలో పోలీసులు శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 25.468 కిలోల గంజాయి పట్టుబడింది. దీనికి సంబంధించి ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అంబొదల ఎస్ఐ కార్తీక్ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. ఎప్పటిలాగే జిగిడి సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మునిగుడ నుంచి ఒక బొలేరో వాహనం వచ్చింది. దానిని ఆపి తనిఖీలు నిర్వహించగా అందులో మూడు సంచుల్లో గంజాయి పట్టుబడింది. దీంతో వాహన డ్రైవర్ నిషాకర్ దండసేన(32), అనూప్ నాయక్(28), అనితా నాయక్ (29)లను అరెస్టు చేశారు.

మహిళా మిషన్ శక్తి బలోపేతానికి కృషి



వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



జయపురంలో వీక్షిస్తున్న ప్రజలు

జయపురం: రాష్ట్రంలో మహిళా మిషన్ శక్తి, స్వశక్తీకరణ బలోపేతానికి కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వెల్లడించారు. నేడు రాష్ట్రంలోని ప్రతీ సమితిలో అమొ ఒడిశా నవీన ఒడిశా కార్యక్రమాన్ని వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొరాపుట్ జిల్లాలో 3,087 ప్రాజెక్టులను చేపట్టేందుకు రూ.170 కోట్లతో నిధులు విడుదల చేశామని తెలియజేశారు. జయపురం క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సస్మిత మెలక, జయపురం సమితి అధ్యక్షురాలు తిలోత్తమ ముదులి, ఉపాధ్యక్షులు గణేష్ పాఢీ, జయపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ బి.సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాక్సింగ్ పోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో శనివారం 7వ సీనియర్స్ పురుషులు, మహిళల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్–2023 పోటీలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా వివిధ కేటగిరిల్లో 13 మంది విజేతలగా నిలిచి పతకాలు అందుకున్నారు. అంతకుముందు ఈ పోటీలను డీఎస్ఏ చీఫ్ కోచ్ కె.శ్రీధర్‌రావు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఏ లక్ష్మణ్‌దేవ్(అను) ప్రారంభించారు.

విజేతలు వీరే..

వివిధ బరువు కేటగిరీల్లో జె.తారకేశ్వరరావు, సీహెచ్ సాయి, సీహెచ్ జ్ఞానేశ్వరరావు, బి.తేజ, పి.నానిబాబు, ఎం.లోకేష్, ఎస్.ఏసు, సోను సింగ్, భరత్ కుమార్, డి.మనోజ్ కుమార్, జి.భానుప్రసాద్, ఆర్.హేమంత్, మహిళా విభాగంలో కె.తేజేశ్వరి విజేతలగా నిలిచారు. వీరంతా ఈ నెల 13 నుంచి 15 వరకు విశాఖపట్నంలో జరిగే ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారు. విజేతలను శాంతి కన్వెన్షన్ ఎండీ జి.నాగరాజు అభినందించారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ సీఈవో బి.వి.ప్రసాదరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, సీనియర్ కోచ్ ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ రాజీవ్‌గాంధీ, సీనియర్ బాక్సర్లు సురేష్, పురుషోత్తం పాల్గొన్నారు.

వీసీ నియామకానికి సెర్చ్ కమిటీ



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఎచ్చెర్ల క్యాంపస్:

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నియామకానికి అన్వేషణ ప్రారంభమైంది. వీసీ ఎంపికలో కీలకమైన సెర్చ్ కమిటీ(అన్వేషణ కమిటీ)ని నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీచేశారు. త్రిసభ్య కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ నామినీగా ప్రొఫెసర్ ఎస్.ప్రభాకరరావు (శ్రీ వెంకటేశ్వర యూనివర్సటీ వీసీ), వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీగా ప్రొఫెసర్ కె.లాల్‌కిశోర్ (జేఎన్‌టీయూ అనంతపురం పూర్వపు వీసీ), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నామినీగా ప్రొఫెసర్ శశికళ వంజారి (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్, న్యూఢిల్లీ)లను నియమించారు. ఇప్పటికే దరఖాస్తులు స్వీకరణ ముగిసింది. పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. సెర్చ్ కమిటీ ఈ దరఖాస్తులను పరిశీలించి ముగ్గురి పేర్లతో జాబితా రూపొందించి రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తారు. సమర్థత, అనుభవం ఆధారంగా వీసీని నియమిస్తారు. ప్రస్తుత వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మూడేళ్ల టెర్మ్ వచ్చే ఏడాది జనవరి 18తో ముగియనున్న సంగతి తెలిసిందే.

క్లుప్తంగా

ఆకట్టుకున్న వర్ణచిత్రం


దీపావళి వర్ణచిత్రం

గరుగుబిల్లి: దీపావళిని పురస్కరించుకుని గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామానికి చెందిన నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు వేసిన నఖచిత్రం పలువురిని ఆకట్టుకుంటోంది.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు

పార్వతీపురంటౌన్: వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నట్టు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య తనిఖీల రికార్డు పరిశీలించి హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్నట్టు గుర్తించిన విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులకు రక్తహీనత లక్షణాలు, సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, రోగ నిరోధకశక్తి తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

ప్రమాదరహిత డ్రైవింగ్ నైపుణ్యాలు అవసరం


మాట్లాడుతున్న శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి విజయకుమార్

విజయనగరం అర్బన్: ఆర్టీసీ రవాణా సేవల్లో డ్రైవింగ్ నైపుణ్యాలు ప్రమాద రహితంగా ఉండాని శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి విజయకుమార్ అన్నారు. ఆర్టీసీ శిక్షణ కళాశాలలో 15 రోజులుగా డ్రైవర్లకు నిర్వహించిన శిక్షణతరగతుల ముగింపు కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. డిప్యూటీ సీఎంఈ కొటాన శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీకాకుళం, ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 600 మంది డ్రైవర్లకు రోజుకు 40 మంది చొప్పున ప్రమాద రహిత డ్రైవింగ్ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి డిపో మేనేజర్ శ్రీనివాసరావు, రీజనల్ సేఫ్టీ మెకానికల్ ఇన్‌స్ట్రక్టర్ సీహెచ్.వేణు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగులతో జాగ్రత్త

- ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో అధిక శబ్దంచేసే బాంబులను పేల్చరాదు
- జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన

పార్వతీపురం టౌన్: ఒడిశా-ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలో వారం రోజులుగా ఒంటరి ఏనుగు హరి సంచరిస్తోందని జిల్లా అటవీశాఖాధికారి ప్రసూన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏడు ఏనుగుల గుంపు ప్రస్తుతం తులసిరామినాయుడువలస వద్ద ఉందని, పరిసర గ్రామాలైన దలైవలస, ఉద్దవోలు, బురదవెంకటాపురం, గొల్లవానివలస, గొట్టివలస, సీమలవానివలస, ఉల్లిభద్ర, మరిపెంట, సంబానవలస, ఎర్రన్నగుడి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దీపావళి రోజున ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో అధిక శబ్దాలుచేసే బాణసంచా కాల్చరాదని సూచించారు. ఒంటరి ఏనుగు హరి సంచారానికి సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే సెల్: 87904 18918, 94933 99467 నంబర్లకు తెలియజేయాలన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థి సత్తా


కోచ్ త్రినాథరావుతో నీలాంజనీప్రసాద్

కొత్తవలస: జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థి ములగపాక నీలాంజనీప్రసాద్ సత్తా చాటారు. మండలంలోని వీరభద్రపురం గ్రామ పంచాయతీ, ములగపాకలవానిపాలెం గ్రామానికి ఈయన ఈ నెల 7, 8, 9వ తేదీల్లో గోవాలో జరిగిన 37వ జాతీయ స్పైవ్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో 58 కేజీల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి, బ్రాంజ్ మెడల్(రజత పతకం) సాధించినట్లు కోచ్ ఎం.త్రినాథరావు శనివారం తెలిపారు. ఈ పోటీల్లో 16 రాష్ట్రాల నుంచి మొత్తం 216 మంది పాల్గొనగా, ఆంధ్రప్రదేశ్ నుంచి 8 మంది పాల్గొన్నారన్నారు. ఈ మేరకు సదరు విద్యార్థి, కోచ్‌ను పలువురు అభినందించారు.

వెలుగుల పండగ దీపావళి



- చిన్నపాటి జాగ్రత్తలతో సంతోషాల హరివిల్లు
- టపాసులు కాల్చేటప్పుడు తస్మాత్
- దీపావళి.. కారాదు విషాదవళి
- కొనుగోలుదారులతో కిక్కిరిసిన బాణసంచా విక్రయ దుకాణాలు
- రూ.కోట్లలో సాగిన వ్యాపారం

అగ్నిప్రమాదాలు సంభవిస్తే 101, 102 నంబర్లకు, గాయపడితే 108కు సమాచారం ఇవ్వాలి


విజయనగరం ఆర్టీసీ కార్యాలయం సమీపంలో బాణసంచా విక్రయ కేంద్రాలు

విజయనగరంటౌన్/పార్వతీపురంటౌన్: అజ్ఞాన చీకట్లను పారదోలే చిరుదివ్వెల పండగ దీపావళి. లోగిళ్లన్నీ నవకాంతులతో వెలుగులీనే వేడుక. పండగ రోజున ఉదయాన్నే చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా నూతన వస్త్రాలను ధరించి లక్ష్మీదేవికి పూజలు, నోములు నిర్వహించడం మన సంప్రదాయం. దానిని కొనసాగిస్తూనే రాత్రివేళ ఇల్లంతా దీపాలతో అలంకరించి, శబ్దరహిత, వాయుకాలుష్యంలేని బాణసంచా కాల్చి... దీపావళిని ఆనందావళిగా జరుపుకోవాలని కాలుష్యనియంత్రణ మండలి, పర్యావరణ పరిరక్షణ సమితులు పిలుపునిచ్చాయి. ఈ ఏడాది గ్రీన్ (హరిత) దీపావళి జరుపుకోవాలని కోరాయి.

షాపింగ్ అదరహో...

దీపావళి సందర్భంగా వ్యాపార, వాణిజ్య సంస్థలు భారీ ఆఫర్లను ప్రకటించాయి. దీంతో ఆయా దుకాణాలు, షాపింగ్‌మాల్స్ కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. బాణసంచా విక్రయాలు జోరుగాసాగాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో శనివారం నాటికి దాదాపు రూ.6 కోట్లకు పైగా వ్యాపారం సాగినట్టు అంచనా. గృహోపకరణాల విక్రయాలైతే దాదాపు రూ.3.50 కోట్ల మేర సాగినట్టు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

పూజకు మంచి ముహూర్తం

దీపావళి అమావాస్య నాడు కేదారేశ్వరి నోములు నోయడం ఆనవాయితీ. సౌభాగ్య సంరక్షణను కాంక్షిస్తూ మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఆశ్వయుజ అమావాస్య ఆదివారం రోజు పూర్తిగా ఉండడంతో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్రతాలు ఆచరించవచ్చని వేదపండితులు వెల్లడిస్తున్నారు.

బాణ సంచా దుష్ఫలితాలివి

బాణసంచా తయారీకి అల్యూమినియం, నైట్రేట్, సల్ఫర్, పొటాషియం, బేరియం నైట్రేట్, కార్బన్ కాడ్మియం వంటి రసాయన పదార్థాలను వినియోగిస్తారు. వీటిని కాల్చడం వల్ల మనం పీల్చే ప్రాణవాయువు కలుషితమవుతుంది. కంటికి కనిపించని రసాయన కణాలు శరీరంలోకి వెళ్లి ఆరోగ్యానికి హానికలిగిస్తాయి. ఊపిరితిత్తుల, జీర్ణకోశ వ్యాధులు, కంటి చూపు దెబ్బతినడం, జ్ఞాపకశక్తి మందగించడం, చెవుడు, కేన్సర్, మానసిక స్థితిని దెబ్బతీసే వ్యాధులు వచ్చే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శారీరక దృఢత్వం తక్కువగా ఉండే పిల్లలు, వృద్ధులు, మహిళలపై బాణసంచా ప్రభావం చూపనుంది. గర్భిణులు, కడుపులో ఉన్న శిశువులకు హానికలుగుతుంది. ఆస్తమా, రక్తపోటు, గుండె వ్యాధిగ్రస్తులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- బాణసంచా కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు, కళ్లజోడు ధరించాలి.
- చిన్న పిల్లలు కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి.
- ఇంటిలోపల, డాబాలపైన, అపార్ట్‌మెంట్లపైన టపాసులు వెలిగించరాదు.
- సగం లేదా పూర్తిగా కాలని టపాసులను వదిలేయకుండా నీరు లేదా ఇసుకను పోయాలి.
- శరీరానికి, దుస్తులకు దూరంగా ఉంచి టపాసులు కాల్చాలి.
- గడ్డి వాములు, గుడిసెలు, పెట్రోల్ బంకులకు దూరంగా టపాసులు కాల్చాలి.
- చేతితో పేలుడు పదార్థాలకు నిప్పు అంటించవద్దు.
- శ్వాస, చర్మ, హృదయ సంబంధిత వ్యాధిగ్రస్తులు టపాసులకు దూరంగా ఉండాలి.
- బాణసంచాను ఇళ్లల్లో నిల్వ చేయరాదు.
- రోడ్లపై నడిచే ప్రజలపైన, బస్సులు, వాహనచోదకులపై బాణసంచా విసరడం నేరం.


విజయనగరంలో జోరుగా బాణసంచా విక్రయాలు


పార్వతీపురంలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

కాలుష్య రహితంగా దీపావళి



దీపావళి పండగను శబ్ద, కాలుష్య రహితంగా జరుపుకోవాలి. వరుణుడి కరుణతో సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. ప్రజలు ప్రశాంతంగా పండగ పూజ చేసుకోవాలి. ఇంటిల్లిపాది ఆనందంగా గడపాలి.

– విక్రాంత్ పాటిల్, ఎస్పీ, పార్వతీపురం మన్యం

సుఖసంతోషాలు కలగాలి



దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి. ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలి. సిరిసంపదలు, సౌభాగ్యాలు కలగాలి. అందరి జీవితాలు ఆనందమయం కావాలి.

– ఆర్.గోవిందరావు, జేసీ, పార్వతీపురం మన్యం

ఆనందాల పండగ



కులమతాలకు అతీతంగా, చిన్నాపెద్దా తారతమ్యంలేకుండా ప్రజలందరూ ఆనందంగా జరుపుకునే పండగ దీపావళి. కాలుష్యరహితంగా గ్రీన్ క్రాకర్స్ వినియోగించాలి. బాణసంచా పేల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. దీపావళి వెలుగులు ప్రజలందరి జీవితాల్లో ప్రసరించాలి.

– నిషాంత్ కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

బాధ్యతాయుతంగా ఉండాలి



టపాసులు అమ్మే వారందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అందుబాటులో అగ్నినిరోధక పరికరాల్లో కనీసం ఒకటైనా ఉంచాలి. ఇసుక, నీటిని తప్పనిసరిగా ఏర్పాటుచేసుకోవాలి. ఇళ్లల్లో టపాసులు కాల్చేటప్పుడు మహిళలు, యువతులు, చిన్నారులు కాటన్ దుస్తులు, బిగుతుగా ఉండేవి ధరించాలి. నీటిని అందుబాటులో ఉంచాలి. ఆనందోత్సవాల మధ్య పండగ నిర్వహించుకోవాలి.

– బి.వి.ఎస్. రామ్‌ప్రకాష్, అగ్నిమాపకశాఖ అధికారి, విజయనగరం

మావోల ప్రభావం లేదు


సీతంపేటలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఐజీ హరికృష్ణ, పక్కన ఎస్పీ విక్రాంత్ పాటిల్

- శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం
- సంతృప్తికరంగా పోలీస్ సేవలు
- పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకానికి చర్యలు
- డీఐజీ హరికృష్ణ

పాలకొండ/సీతంపేట: రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, పోలీస్ వ్యవస్థ సంతృప్తికరంగా సేవలందజేస్తోందని డీఐజీ ఎస్.హరికృష్ణ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పాలకొండ, సీతంపేట పోలీస్‌స్టేషన్లను ఆయన శనివారం సందర్శించారు. స్టేషన్ పరిధిలోని రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ ప్రాంతంలో మావోల ప్రభావం లేదన్నారు. కూంబింగ్ మాత్రం యథావిధిగా నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. పలు పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది ఖాళీలపై స్పందిస్తూ ఇప్పటికే ఎస్సై పోస్టులకు పరీక్షలు జరిగాయని, త్వరలోనే కానిస్టేబుల్ ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ప్రజలతో సత్సంబంధాల మెరుగుకు కానిస్టేబుళ్లకు బాధ్యతలు అప్పగించామన్నారు. గ్రామాలను వారికి దత్తత ఇచ్చామన్నారు. ఎస్ఐలు కూడా మానిటరింగ్ చేస్తున్నారన్నారు. పోలీసులు స్థానికంగా నివసించేందుకు వీలుగా క్వార్టర్స్ లేని చోట నిర్మాణానికి కొత్తగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఆయన వెంట పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ జి.వి.కృష్ణారావు ఉన్నారు.

ప్రయాణికులకు నాణ్యమైన సేవలు

పార్వతీపురం టౌన్: ప్రయాణికులే మా దేవుళ్లని, వారికి నాణ్యమైన సేవలందించడంలో భాగంగా సమస్యలు తెలుసుకునేందుకు, సలహాలు స్వీకరించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించినట్టు జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ శనివారం తెలిపారు. డీపీటీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 23 మంది ప్రయాణికులు ఫోన్‌చేసి సూచనలు, తమ సమస్యలు చెప్పారన్నారు. 13 మంది పార్వతీపురం నుంచి పెదబుడ్డిడి వయా రావివలస ఎస్/ఓ బస్సును పునరుద్ధరించాలని కోరినట్టు వెల్లడించారు. కండక్టర్ దురుసు ప్రవర్తనపై ఒకరు ఫిర్యాదు చేశారన్నారు. పార్వతీపురం నుంచి బత్తిలి, మసిమండ ఎస్/ఓ, కూనేరు ఎస్/ఓ సరవపాడు, రాజ్యలక్ష్మీపురం, కళ్లికోట, సంగంవలస గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మరికొందరు కోరారన్నారు. గుచ్చిమి, మరిపివలస, సీతానగరం, కోటవానివలస వద్ద బస్సులు ఆగేలా చూడాలని కొందరు ప్రయాణికులు విజ్ఞప్తిచేశారని తెలిపారు. పార్వతీపురం పట్టణ శివారులో సురేష్ స్కూల్‌కి, నర్సిపురం మధ్యలో ఉన్న పద్మ పేరంటాలు గుడివద్ద రిక్వెస్ట్ స్టాప్ బోర్డు ఏర్పాటు చేయాలని, వైకేఎం కాలనీ, వెంకంపేట గోరీల వద్ద ట్రాల్టా డీలక్స్ బస్సులకు స్టాప్ సదుపాయం కల్పించాలని కొందరు విజ్ఞప్తిచేశారన్నారు. పార్వతీపురం నుంచి తాడికొండకు అదనపు ట్రిప్‌లు ఏర్పాటు చేయాలని మరొకరు కోరారన్నారు. అర్జీలను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి వాటి పరిష్కారదిశగా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

చదువుతోనే భవిష్యత్తు

- జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్



విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్

విజయనగరం అర్బన్: చదువుతోనే బంగారు భవిష్యత్తు సొంతమవుతుందని, ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీకుమార్ పిలుపునిచ్చారు. విజయనగరం పట్టణంలోని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్య ప్రాధాన్యతను వివరించారు. ప్రాథమిక హక్కుగా ఉన్న విద్యను అభ్యసించి భావితరాలకు ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ వెంకట లక్ష్మి, గ్రంథాలయాధికారి డాక్టర్ లెంక సత్యవతి పాల్గొన్నారు.

జ్ఞాన కాంతులు.. కలశ జ్యోతులు

- వేదమంత్రాలతో మార్మోగిన వనంగుడి
- పైడితల్లికి పంచామృతాలతో అభిషేకాలు
- కలశజ్యోతులు పట్టుకుని దీక్షాపరుల ర్యాలీ
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


చదురుగుడిలో ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: పైడితల్లి నామస్మరణతో విజయనగరం పట్టణం పులకించిపోయింది. మాలధారుల జైజై పైడిమాంబ నామస్మరణ, కలశ జ్యోతుల వెలుగులో అమ్మవారి శోభాయాత్ర శనివారం వైభవంగా సాగింది. వనంగుడి నుంచి చదురుగుడి వరకు దారిపొడవునా భక్తులు జ్యోతి దర్శనం చేసుకున్నారు. చల్లంగ చూడాలంటూ తల్లిని శరణువేడారు. పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో సాగిన కలశ జ్యోతుల యాత్రను ఈఓ కె.ఎల్.సుధారాణి స్వీయపర్యవేక్షణ చేశారు. అమ్మవారి ఉత్సవ రథంతో చదురుగుడి వరకూ దీక్షధారులతో కలిసి నడిచారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, వేదపండితులు తాతా రాజేష్, దూసి శివప్రసాద్, సాయికిరణ్‌లు అమ్మవారికి ఉదయం నుంచి శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, అచ్చిరెడ్డిల నిర్వహణలో దీక్షదారులు భజనలు చేశారు.

ఊరంతా అమ్మవారి వెలుగులు

వనంగుడి నుంచి ప్రారంభమైన కలశ జ్యోతుల ర్యాలీ గాడీఖానా, మైఎస్సార్ కూడలి, ఎన్‌సీఎస్ రోడ్డు, కన్యకాపరమేశ్వరి ఆలయం, గంటస్తంభం మీదుగా చదురుగుడికి చేరుకుంది. దారిపొడవునా మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు. కలశజ్యోతుల ర్యాలీతో నగరానికి దీపశోభ చేకూరింది.


రథాన్ని లాగుతున్న ఆలయ సిబ్బంది, భక్తులు


కలశ జ్యోతుల ఊరేగింపులో స్వాములు, ఇతరులు

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి



మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

పార్వతీపురం: భారతదేశ మొదటి విద్యాశాఖమంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనార్టీ వెల్ఫేర్‌డే, జాతీయ ఎడ్యుకేషన్‌డేను శనివారం నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ ఏఓ ఎం.ఉమామహేశ్వరరావు, సెక్షన్ అధికారి శ్రీరామూర్తి, మైనార్టీ ప్రతినిధి మహమ్మద్ లబ్దుల్ ఖుదుష్, క్రిస్టియన్ ప్రతినిధులు బిషప్ ఎస్.తిమోతి, ఎన్.సుధీర్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


చోరీ వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ తిరుపతిరావు(వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: చోరీ కేసులో నిందితుడిని రూరల్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావు వివరాలిలా ఉన్నాయి.. ద్వారపూడి వినాయకనగర్‌లో నివాసముంటున్న హిమమణి, ఆమె భర్త సూర్యప్రకాష్ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఈ నెల 6వ తేదీన ఎప్పటిలాగే విధుల నిమిత్తం పాఠశాలకు వారు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో హిమమణి ఇంటికి వచ్చి, చూడగా ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. 8 తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ఎస్ఐ గణేష్ బృందం దర్యాప్తు చేపట్టారు. గతంలో వారింటి పనులు చేసిన కాశీఘాట్ కాలనీకి చెందిన బొందిలి దిలీప్‌కుమార్ అనే వ్యక్తే ఇంటికి వచ్చి, చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు అతడిని విచారణ చేయగా, ఇంటి తాళాలు తీసి, బీరువాలోని ఆభరణాలు దొంగిలించినట్లు అంగీకరించాడని సీఐ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి ఆభరణాలు రికవరీ చేశామన్నారు. ఈ కేసు ఛేదనలో క్రియాశీలక పాత్ర పోషించిన ఎస్ఐ గణేష్, కానిస్టేబుళ్లు కె.రామమోహనగౌరి, రామకృష్ణ తదితరులను అభినందించారు.

ఐఎన్ఐ సెట్‌లో మందరాడ వాసికి 155వ ర్యాంకు

రాజాం/సంతకవిటి: ఐఎన్ఐ(ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్) సెట్ ఫలితాల్లో సంతకవిటి మండలం, మందరాడ గ్రామానికి చెందిన వావిలపల్లి చంద్రమౌళి ఆలిండియా విభాగంలో 155వ ర్యాంకు సాధించారు. ఈ యువకుడు నవంబరు 5వ తేదీన జరిగిన మెడికల్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్ రాయగా, శనివారం ఫలితాలు వెలువడ్డాయి. పీజీలో జనరల్ మెడిసిన్ కోర్సు చేసేందుకు గాను ఈ పరీక్ష రాసినట్లు చంద్రమౌళి తెలిపారు. ఈయన 2017లో జరిగిన నీట్‌లో ఆలిండియా విభాగంలో 508వ ర్యాంకు సాధించి, విశాఖ కేజీహెచ్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. తాజాగా ఐఎన్ఐ సెట్‌లో కూడా ప్రతిభ చాటడంతో అందరూ అతడిని అభినందిస్తున్నారు. ఈయన తల్లి భాగ్యలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయిని కాగా, తండ్రి శ్రీనివాసరావు వైఎస్సార్ క్రాంతి పథం శాఖలో సీసీగా పనిచేస్తున్నారు.

పంచారామాల దర్శనానికి ప్రత్యేక బస్సులు

- జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్

పార్వతీపురంటౌన్: కార్తీకమాసం సందర్భంగా, పంచారామాల దర్శనానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ నెల 19, 26వ తేదీల్లో అలాగే డిసెంబరు 3, 10వ తేదీల్లో పంచారామ క్షేత్రాలను దర్శించుకునేలా పార్వతీపురం డిపో నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పార్వతీపురం బస్టాండ్ నుంచి బస్సులు బయలుదేరి, మరుసటిరోజు ఉదయం అమరావతి(అమరేశ్వరుడు)చేరుకుంటుందని, అక్కడ నుంచి భీమవరం (భీమేశ్వరుడు), పాలకొల్లు(క్షీర రామలింగేశ్వరుడు), ద్రాక్షారామం(భీమలింగేశ్వరుడు), సామర్లకోట(కుమార లింగేశ్వరుడు) ఆలయాలు దర్శించుకుని, తిరిగి రావడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శబరిమలకూ..

శబరిమల అయ్యప్ప భక్తుల కోసం పార్వతీపురం డిపో నుంచి సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. శబరిమల ఆరురోజుల యాత్రలో కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, ఎరుమేలి, శబరిమల, మదురై, కంచి, తిరుపతి, విజయవాడకు బస్సులు వేస్తున్నామన్నారు. ఒక్కో ప్రయాణికునికి సూపర్ లగ్జరీకి రూ.7,300, ఆల్ట్రా డీలక్స్‌కు రూ.7,200 చార్జీ నిర్ణయించామన్నారు. టూర్ ప్యాకేజీ వారు కోరిన రోజుల్లోనే బస్సు మొత్తం బుక్‌చేసుకుని వెళ్లే సౌకర్యం కూడా కల్పించామన్నారు. అడ్వాన్స్ రిజర్వేషన్‌కు ఫోన్ నంబర్ 7382834909ను సంప్రదించి, టికెట్ రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలనుకునే వారు ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్ నందు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.